మద్యం దుకాణాలకు 16 దరఖాస్తులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మద్యం దుకాణాలకు శుక్రవారం 16 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలో 158 మద్యం దుకాణాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ఈనెల ఒకటో తేదీన గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇప్పటివరకు ఎక్సైజ్ శాఖకు 21 దుకాణాలకు సంబంధించి మొత్తం 23 దరఖాస్తులు చేరాయి. వాటిలో పొందూరు మండలంలో ఆరు దుకాణాలకు అత్యధికంగా ఎనిమిది దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలోని 14 దుకాణాలకు ఐదు దరఖాస్తులు చేరాయి.

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలి

- జిల్లాలో రిఫైనరీ ఏర్పాటుకు కృషి
- రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లా అభివృద్ధిలో అగ్రగామిగా నిలవాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. స్వర్ణాంధ్ర-2047లో భాగంగా 2024-29 కాలానికి జిల్లా, మండల స్థాయి ప్రణాళిక రూపకల్పనలో భాగంగా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఎమ్మెల్యేలతో కలిసి శుక్రవారం అభిప్రాయ సేకరణకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరుల నుంచి అభిప్రాయాలు సేకరించాలని చెప్పారు. జిల్లాలోని అన్ని వనరులను వినియోగించుకొని అభివృద్ధి చేసి వెనుకబడిన జిల్లా పేరును పోగొట్టుకోవాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన శాఖల ద్వారా వృద్ధి సాధించవచ్చని చెప్పారు. వ్యవసాయానికి శతశాతం డ్రోన్ల వినియోగాన్ని పెంచుకోవాలని సూచించారు. పామాయిల్ సాగును అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు.

సుదీర్ఘ తీర ప్రాంతాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుడగట్లపాలెం హార్బర్ పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టుకు వచ్చే జూన్ 12వ తేదీ నాటికి ఒక షిప్ వచ్చే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నం నుంచి భోగాపురానికి, భోగాపురం నుంచి మూలపేట పోర్టుకు రహదారి ఏర్పాటు చేస్తే తీర ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. జిల్లాలో విమానాశ్రయం ఏర్పాటుకు భూసేకరణ ప్రయత్నాలు ప్రారంభమయ్యాయన్నారు. పలాస, మరికొన్ని ప్రాంతాల్లో నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రానికి రిఫైనరీ వచ్చిందని, దీన్ని జిల్లాలో ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. రిఫైనరీ ఏర్పాటు చేస్తే జిల్లా రూపురేఖలు మారిపోతాయన్నారు. టెంపుల్ టూరిజానికి సంబంధించి ఒక బస్సు ఏర్పాటు చేసి జిల్లాలోని ఆలయాలను సందర్శించవచ్చన్నారు. అందరూ కలసికట్టుగా ప్రణాళికాబద్ధంగా జిల్లాను అభివృద్ధి చేద్దామని పిలుపునిచ్చారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ వికసిత్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర -2047పై ఇప్పటివరకు 1.24 లక్షల మంది నుంచి స్పందన వచ్చిందన్నారు. అభిప్రాయ సేకరణలో రాష్ట్రస్థాయిలో జిల్లా ముందంజలో ఉందన్నారు. ప్రస్తుతం జిల్లాస్థాయి ప్రణాళికలను తయారు చేయాల్సి ఉందన్నారు. సంపద సృష్టి, సుస్థిర ఆర్థికాభివృద్ధి సాధించడం తదితర వాటిపై ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. సమావేశంలో ఎమ్మెల్యేలు కూన రవికుమార్, ఎన్.ఈశ్వరరావు, బగ్గు రమణమూర్తి, గొండు శంకర్, ఎమ్మెల్సీ నర్తు రామారావు, సిపిఒ లక్ష్మీప్రసన్న, డిఎంహెచ్ఒ బి.మీనాక్షి, ఎపిఎంఐపి డీడీ శ్రీనివాసరావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ ఉమామహేశ్వరరావు, పట్టు పరిశ్రమశాఖ ఎడి రాజేంద్ర ప్రసాద్, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, డిఇఒ తిరుమల చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుకలో ప్రభుత్వం విఫలం

- నేటికీ పూర్తిస్థాయిలో అందని ఇసుక
- యథేచ్ఛగా అక్రమ రవాణా
- సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి
- కేజీల రూపంలో ఇసుక అమ్ముతూ వినూత్న నిరసన

ఇసుక అమ్ముతూ నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడంలో రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి విమర్శించారు. ఉచిత ఇసుక హామీని పూర్తిస్థాయిలో వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన నగరంలోని ఏడు రోడ్ల కూడలి వద్ద కేజీల రూపంలో ఇసుక అమ్ముతూ వినూత్న రీతిలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల పాలనలో ఉచిత ఇసుక హామీని ప్రభుత్వం పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. పేరుకు ఉచిత ఇసుక అయినా గతంలో ఉన్న ధరే ఇప్పుడూ ఉందన్నారు. సామాన్య ప్రజలకు ఇసుక ఉచితంగా అందించడంలో విఫలమైందన్నారు. ఇసుక లేకపోవడంతో భవన నిర్మాణ కార్మికులకు పనుల్లేకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు ఇప్పటికే భవన నిర్మాణ కార్మికులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. మరోవైపు సహజసిద్ధంగా లభించే ఇసుకను ఇసుకాసురులు యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారని విమర్శించారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణా పెద్దఎత్తున సాగుతోందని, దీన్ని అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారుల అండదండలతోనే ఇసుకాసురులు చెలరేగిపోతుంటే, సామాన్యులకు ఇసుక అందని ద్రాక్షగానే మిగులుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుకను అక్రమ రవాణా చేస్తున్న లారీల యాజమానులపై కేసులు నమోదు చేయొద్దంటూ ప్రజాప్రతినిధులు హుకుం జారిచేస్తున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని హితవు పలికారు. దీనిపై ప్రభుత్వం జోక్యం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వం వెంటనే ఉచిత ఇసుక పథకాన్ని అమలు చేసి సామాన్యులకు ఇసుకను అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. లేకుంటే భవిష్యత్ పోరాటాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కె.మోహనరావు, జి.సింహాచలం, నాయకులు కె.నాగమణి, పి.తేజేశ్వరరావు, సిహెచ్.అమ్మన్నాయుడు, కొత్తకోట అప్పారావు, పి.ప్రసాదరావు, ఎం.ఆదినారాయణమూర్తి, ఎం.గోవర్ధనరావు, ఆర్.ప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగంలో రెండు అతిథి అధ్యాపక పోస్టుల నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ (బిఎస్‌సి, బిటెక్)లో కంప్యూటర్ సైన్స్, పిజి (ఎంసిఎ, ఎంఎస్‌సి, ఎం.టెక్) కంప్యూటర్ సైన్స్‌లో కనీసం 55 శాతం మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. నెట్, సెట్, పిహెచ్‌డి అర్హతలు కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈనెల 5న ఉదయం పది గంటలకు ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో గల కంప్యూటర్ సైన్స్ విభాగంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

అలాంటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కి ప్రైవేటు టీచర్స్, లెక్చరర్స్, విద్యార్థుల హక్కులను కాలరాస్తున్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగు మన్మథరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి రాగోలు నాగశివ, బి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆ యాజమాన్యాలకు సహకరిస్తున్న విద్యాశాఖ అధికారుల పైనా చర్యలు తీసుకుని సస్పెండ్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దసరా సెలవుల్లో విచ్చలవిడిగా ప్రైవేట్ పాఠశాలలు, యాజమాన్యాలు పనిచేస్తున్నాయంటే దానికి విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమని పేర్కొన్నారు. దసరా సెలవుల్లో వర్క్‌షాపుల పేరుతో ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్‌ను యాజమాన్యాలు వేధిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంతా జరుగుతున్నా విద్యాశాఖ అధికారులు చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా దసరా సెలవులు పూర్తిస్థాయిలో అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యాశాఖ ఆదేశాలనూ పాటించరా..?

బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం ఆగ్రహం

ప్రజాశక్తి - ఆమదాలవలస, శ్రీకాకుళం అర్బన్

దసరా సెలవుల్లో పాఠశాలల్లో తరగతులు నిర్వహించరాదని ఒకవైపు ప్రభుత్వం, మరోవైపు విద్యాశాఖ అధికారులు, బాలల హక్కుల కమిషన్ చెప్పున్నా మీకు పట్టదా అని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అశోక పబ్లిక్ స్కూల్ యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన పట్టణంలోని పలు పాఠశాలలను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా గేటులోని అశోక పబ్లిక్ స్కూల్‌కు వెళ్లగా, అక్కడ పదో తరగతి విద్యార్థులకు తరగతులు నిర్వహించడాన్ని గుర్తించి యాజమాన్యాన్ని ప్రశ్నించారు. మరోసారి ఇలా జరిగితే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. అశోక పబ్లిక్ స్కూల్‌లో తనిఖీల విషయం తెలుసుకున్న బ్రిడ్జి చివరన ఉన్న మరో పాఠశాల యాజమాన్యం వెంటనే పదో తరగతి విద్యార్థులను విడిచిపెట్టి పాఠశాలకు తాళాలు వేసేసింది.

ఆమదాలవలస : స్కూల్ యాజమాన్యాన్ని ప్రశ్నిస్తున్న సీతారాం

ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లో ఫీడింగ్ కేంద్రాలు

ఆర్‌టిసి కాంప్లెక్స్‌ల్లో పిల్లలకు తల్లి పాలు పట్టే ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం సూచించారు. శ్రీకాకుళం నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్సు ఆవరణలోని ఆర్ఎం కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఫీడింగ్ కేంద్రాల ఏర్పాటుకు తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల బస్సు పాసుల జారీపై పలు అంశాలను ఆయన ప్రస్తావించారు. కాంప్లెక్స్ ఆవరణలో స్త్రీ, శిశుసంక్షేమ శాఖ సమన్వయంతో బాలల హక్కులు, వారి సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. గంజాయితో పాటు ఇతర మాదక ద్రవ్యాల అక్రమ రవాణా జరగకుండా డ్రైవర్లు, కండక్టర్లకు అవగాహన కల్పించాలన్నారు. వికలాంగుల సంక్షేమశాఖ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వికలాంగ బాలలకు అందిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వికలాంగ పిల్లల హక్కుల పరిరక్షణ, సంక్షేమానికి కట్టుబడి అన్ని సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో ఐసిడిఎస్ పీడీ బి.శాంతిశ్రీ, వికలాంగశాఖ ఎడి కవిత, జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ శ్రీలక్ష్మి, సభ్యులు గన్నెప్పడు, వి.రమణ మూర్తి, జిల్లా బాలల సంరక్షణ అధికారి కె.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

'ఆశా'లపై వేధింపులు ఆపాలి

- ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు నాగమణి
- వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ధర్నా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆశావర్కర్లపై రాజకీయ వేధింపులు, తొలగింపులు మొదలయ్యాయని, వాటిని తక్షణమే ఆపాలని ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు కె.నాగమణి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సిహెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశావర్కర్ల సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన ఆశాలు శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యారోగ్యశాఖతో పాటు సచివాలయాల్లో ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించడం తగదన్నారు. గత నెల 25న యూనియన్ నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించకుండా లిఖితపూర్వక ఆదేశాలిస్తామని డిఎంహెచ్ఒ చెప్పినా ఇంతవరకు ఉత్తర్వులు ఇవ్వలేదని విమర్శించారు. ఆశాలకు సంబంధం లేని పనులు అప్పగించవద్దని రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో వైద్యారోగ్యశాఖ అధికారులు రాతపూర్వకంగా ఉత్తర్వులు జారీ చేశారని చెప్పారు. జిల్లాలో ఆశాలపై చిన్నచూపు తగదన్నారు. బిపి, షుగర్ పరీక్షలతో పాటు వ్యాక్సిన్ క్యారియర్లు మోయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్‌సిహెచ్ రికార్డులను ఆశాలకు అప్పగించి రాయిస్తున్నారని చెప్పారు. ఒపి డ్యూటీలు, పిహెచ్‌సిలు, హెల్త్ క్లినిక్‌లు శుభ్రం చేయిస్తున్నారని తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పిలు ఆశాలను ఇబ్బంది పెడుతున్నారన్నారు. ఒకే వ్యక్తి ఎఎన్ఎంతో ఫీల్డ్ వర్కు, ఎంఎల్‌హెచ్‌పితో వెల్‌నెస్ సెంటర్‌లో పనిచేయడం ఎలా సాధ్యపడుతుందని ప్రశ్నించారు. లొకేషన్ ఫొటోల కోసం ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ సెలవులు ఆశాలకూ వర్తింపజేయాలని చేయాలని, అదనపు పనులకు అదనపు వేతనం ఇవ్వాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌కు నెలకు కేవలం రూ.నాలుగు వేలు వేతనం ఇచ్చి వెట్టిచాకిరీ చేయిస్తున్నారని, వారిని ఆశాలుగా గుర్తించి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. ఆశాలు గర్భిణులను తనిఖీలకు తీసుకెళ్లేందుకు ఛార్జీలు ఇవ్వాలని, పిహెచ్‌సిల్లో రాత్రి విధుల్లో నియమించరాదని డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన ఖాళీగా ఉన్న ఆశా పోస్టులను భర్తీ చేయాలన్నారు. కె.కొత్తూరు సచివాలయం-3 ఆశా కార్యకర్త సరస్వతిని వేధించిన ఎఎన్ఎం హేమలతపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నా శిబిరానికి వచ్చిన డిఎంహెచ్ఒ బొడ్డేపల్లి మీనాక్షి తన పరిధిలోని సమస్యలను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ధర్నాలో ప్రజానాట్యమండలి కళాకారులు చింతాడ రామచంద్రరావు, శ్రీనివాస్ గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో సిఐటియు సీనియర్ నాయకులు కె.శ్రీనివాసు, ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, సిఐటియు జిల్లా కోశాధికారి అల్లు సత్యనారాయణ, పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు లావణ్య, సుజాత, భవాని తదితరులు పాల్గొన్నారు.

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను పరిశీలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు తదితరులు

జనవరిలో నూతన కలెక్టరేట్ ప్రారంభం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను సత్వరమే పూర్తి చేసి, వచ్చే జనవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌ను శుక్రవారం ఆయన సందర్శించి పనుల పురోగతి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని శాఖలు ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా నూతన కలెక్టరేట్ నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. ఒక వ్యక్తి పలు శాఖల అధికారులను కలవాలని వస్తే నూతన కలెక్టరేట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. బ్రిటీష్ కాలంలో నిర్మించిన ప్రస్తుత కలెక్టరేట్‌కు ఏటా మరమ్మతులు చేయడం వల్ల నిధులు వృథా అవుతున్నాయని చెప్పారు. అందుకే అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఒకే ప్రాంగణంలో ఉండేలా రూపకల్పన చేసి అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారని తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల నిర్మాణంలో జాప్యమైందని, త్వరితగతిన పనులు పూర్తి చేసేలా కాంట్రాక్టర్‌తో మాట్లాడినట్లు చెప్పారు. పూర్తి చేస్తే వస్తున్న జనవరి నెలలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతులు మీదుగా ప్రారంభించి ప్రజలకు అంకితం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎమ్మెల్యేలు బగ్గు రమణమూర్తి, కూన రవికుమార్, గొండు శంకర్, ఎన్.ఈశ్వరరావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఆర్అండ్‌బి ఎస్ఇ జాన్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

'సుడా' వైస్ చైర్మన్‌గా జెసి

ప్రజాశక్తి - శ్రీకాకుళం

శ్రీకాకుళం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు పూర్తి అదనపు బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 14 పట్టణాభివృద్ధి సంస్థలకు వైస్ చైర్మన్లుగా జాయింట్ కలెక్టర్లను ప్రభుత్వం నియమించింది. అందులో భాగంగానే సుడా వైస్ చైర్మన్‌గా అదనపు బాధ్యతలు కట్టబెట్టింది. సుడా విసిగా త్వరలో ఆయన బాధ్యతలు చేపట్టనున్నారు.

ప్రజా దర్బార్‌కు 340 అర్జీలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగరపాలక సంస్థలో ఎమ్మెల్యే గొండు శంకర్ శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్‌కు 340 అర్జీలు వచ్చాయి. ఎమ్మెల్యే స్వయంగా వినతులు స్వీకరించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టిడ్కో ఇళ్లు మంజూరు కోసం రూ.లక్షల్లో నగరపాలక సంస్థకు చెల్లించినా, ఇళ్లు రాకపోగా డిడిలు ఏమయ్యాయో తెలియడం లేదంటూ మహిళలు ఫిర్యాదు చేశారు. వ్యక్తిగత సమస్యలతో పాటు తమ ప్రాంతంలో రోడ్లు, డ్రెయినేజీ సౌకర్యం కల్పించాలని పలువురు కోరారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నామని ఎమ్మెల్యే శంకర్ అన్నారు. అందులో భాగంగానే నేరుగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించేందుకు ప్రజా దర్బార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన వినతలను శాఖల వారీగా సమీక్షించి ఆయా విభాగాలు త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పి.వి.వి.డి ప్రసాదరావు, తహశీల్దార్ గణపతిరావు, మున్సిపల్ కార్పొరేషన్ ఇంజినీర్లు తదితరులు పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే శంకర్

రైల్వే అనుసంధానం మరింత పెంపు

కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సూచన

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం, సోంపేట

తూర్పు తీరంలో అత్యంత కీలకమైన ఒడిశా-శ్రీకాకుళంను దేశంలో మిగతా ప్రాంతాలతో అనుసంధానం చేసేలా రైలు రవాణా వ్యవస్థ మరింత మెరుగుపడాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ మేరకు రైల్వే ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఒడిశా రాష్ట్రం భువనేశ్వర్‌లో శుక్రవారం నిర్వహించిన ఖుర్దా రోడ్ డిఆర్ఎం సమావేశానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ ఒడిశా రాజధాని భువనేశ్వర్ నుంచి మూడు రాష్ట్రాల రాజధానులను కలిపేలా శ్రీకాకుళం రోడ్డు, విజయవాడ మీదుగా సికింద్రాబాద్‌కు వందేభారత్ సెమీ హైస్పీడ్ స్లీపర్ క్లాస్ రైలు నడపాల్సిన ప్రాధాన్యతను వివరించారు. ప్రఖ్యాత పూరీ జగన్నాథ్, తిరుమల వెంకటేశ్వర ఆలయాన్ని అనుసంధానం చేసేలా పూరీ - తిరుపతి మధ్య వందేభారత్ రైలు ప్రారంభించాలన్నారు.

జిల్లాలో రైల్వేస్టేషన్ల అభివృద్ధిపై..

శ్రీకాకుళం జిల్లా పరిధిలోని పలు రైల్వేస్టేషన్లలో అమృత్ భారత్ పథకం కింద చేపడుతున్న అభివృద్ధి పనులపై కేంద్ర మంత్రి సమీక్షించారు. మందస రైల్వేస్టేషన్ ప్రవేశం నుంచి నేరుగా ప్లాట్‌ఫారానికి చేరుకునేలా నమూనాలు రూపకల్పన చేయాలన్నారు. ఇచ్ఛాపురం, కంచిలి, కొర్లాం, మందస, జాడుపూడి ఆర్ఒబి పనుల్లో తీవ్ర జాప్యంపై అసంతృప్తి వ్యక్తం చేసి, త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. పలు ప్రాంతాల్లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి, మౌలిక వసతులకు సంబంధించిన పనులు వేగవంతం చేయాలని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్, జెడ్ఆర్‌యుసిసి సభ్యులు కె.సూర్యప్రకాశరావు, జనసేన నాయకులు ఎస్.ప్రసాదరావు, రైల్వే యూజర్స్ కమిటీ సభ్యులు గోపాల్, రమేష్, బత్తుల రమణ , బారువ రైల్వే సాధన కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న కేంద్ర మంత్రి , ఎమ్మెల్యే అశోక్

ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి కృషి

ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - పలాస

ప్రజల సమస్యలను పరిష్కరించేందుకే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (మీకోసం) నిర్వహిస్తున్నట్లు ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఎనిమిది ఫిర్యాదులు వచ్చాయి. కుటుంబ తగాదాలకు సంబంధించి 1, ఎస్‌సి, ఎస్‌టి అంశాలకు సంబంధించి 1, మోసపూరితమైన అంశంపై 2, ఇతర అంశాలపై నాలుగు ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదులను స్వీకరించిన ఎస్‌పి వారి సమస్యలను విని సానుకూలంగా స్పందించారు. సమస్యలపై పూర్తిస్థాయి విచారణ చేసి పరిష్కరిస్తామని భరోసానిచ్చారు. ప్రజలు వారి సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకొస్తే చట్టపరిధిలో పూర్తి విచారణ చేసి త్వరితగతిన పరిష్కారం చూపడానికి చర్యలు తీసుకుంటామన్నారు. పలాస డివిజన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రజలు వారి సమస్యలను విన్నవించేందుకు శ్రీకాకుళం రావడం కష్టమవుతుందన్న ఉద్దేశంతో తానే ప్రతి శుక్రవారం పలాస వచ్చి ఫిర్యాదులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తనకు అందిన ప్రతి ఫిర్యాదుపై విచారణ చేసి పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు.

వినతులు స్వీకరిస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

విచారణ చేపడుతున్న ఎపిడి శైలజ

ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మేఘవరం పంచాయతీకి చెందిన ఫీల్డు అసిస్టెంట్లు గంట గోవిందరావు, సూరాడ శ్రీదేవిలపై మేఘవరానికి చెందిన పరపటి రాజశేఖర్ రెడ్డి, సూరాడ రాయుడు గత నెల 25న గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు చేయగా ఆ ఫిర్యాదు మేరకు ఉపాధిహామీ ఎపిడి ఎం. శైలజ శుక్ర వారం మేఘవరం సచివాలయంలో విచారణ చేపట్టారు. సర్పంచ్ పరపటి సునీత అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ విచారణలో ఫిర్యాదు దారులు తెలిపిన అభియోగాలపై విచారణ చేపట్టి మొదట ఫిర్యాదు దారుల వివరణను ఎపిడి నమోదు చేశారు. ఈ విచారణలో ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లు పనికి రాని వారికి మస్టర్లు వేశారని, విదేశాల్లో ఉన్న వారికి మస్టర్లు వేశారని తెలిపారు. పోర్టు కోర్టు ప్రారంభోత్సవం మీటింగుకు కూలీలకు పంపించి మస్తర్లు వేసి ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేశారని వారిపై ఆరోపించారు. 400 మొక్కలు నాటామని చెప్పి బిల్లులు చేసుకున్నారని, ఒక్క మొక్క కూడా లేదని వారు ఆరోపి ంచారు. అనంతరం ఫిర్యాదుదారుల లేవనెత్తిన ఆరోపణలపై ఇద్దరు ఫీల్డ్ అసిస్టెంట్‌లను ఎపిడి విచారణ చేపట్టారు. విచారణ నివేదికను పీడీకి అంద జేస్తానని ఆమె తెలిపారు. ఈ విచారణలో ఎంపిటిసి సూరాడ రాజా రావు, ఎపిఒ పి.నరసింహమూర్తి, ఇసి ధర్మారావు, కార్యదర్శి కె.విద్య పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న రైతుసంఘం నాయకులు, రైతులు

పంపుసెట్లకు స్మార్ట్‌మీటర్లు తొలగించాలి

ప్రజాశక్తి- రణస్థలం

వ్యవసాయ పంపుసెట్లుకు స్మార్ట్ మీటర్లు తొలగించాలని, విద్యుత్ ఇంధన సర్దుబాటు ఛార్జీల భారం ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెలమల రమణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రణస్థలం సచివాలయం ఎదుట రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాత పెట్టుబడి సాయం రూ.20 వేలు వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాలని, గతేడాది నష్టపోయిన రైతుల పంటలకు భీమా పరిహార వెంటనే చెల్లించాలని, సమగ్ర ఉచిత పంటల భీమా సదుపాయం కల్పించాలని, తోటపల్లి ప్రాజెక్టు పూర్తి చేసి శివారు భూములకు సాగు నీరు అందించాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకం లేకుండా వాస్తవ సాగుదారులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని, కొబ్బరి పార్కు ఏర్పాటు చేయాలని, మొక్క జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇ.రమణ, దాడిశెట్టి ఆదినారాయణ, పిన్నింటి అప్పలనాయుడు, మహంతి సత్యం, పిన్నింటి గోవింద తదితరులు పాల్గొన్నారు. అనంతరం సచివాలయ కార్యదర్శి చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందించారు.

హుండీలను లెక్కిస్తున్న దేవాదాయ శాఖ సిబ్బంది

కొత్తమ్మతల్లి ఆదాయం రూ.18.21 లక్షలు

కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి జాతర ఉత్సవాల ద్వారా మంగళ, బుధ, గురువారాల్లో రూ.18,21,517లు ఆదాయం లభించినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వాకచర్ల రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ధర్మహుండీలను దేవాదాయ శాఖాధికారుల సమక్షంలో విప్పి లెక్కించారు. స్పెషల్ దర్శనం టిక్కెట్లు ద్వారా రూ.1.87.140, మొక్కుబడి రుసుం ద్వారా రూ.2.33.900, హుండీల ద్వారా రూ.14.00.477 ఆదాయం లభించిందన్నారు. గతేడాది ఉత్సవాల ద్వారా ఆదాయం రూ.20.12.242లు రాగా ఈ ఏడాది రూ.18.21.517లు వచ్చిందని, గత ఏడాదితో పోల్చితే ఈ ఏడాది రూ. 1.90.725లు ఆదాయం తగ్గిందని ఆయన తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో కొత్తమ్మతల్లి ఉత్సవాల ముఖ్య అధికారి డి.భద్రాజీ, శ్రీకాకుళం ఎసి బి.ఆర్.వి.వి. ప్రసాద్ పట్నాయక్, గ్రామ పెద్దలు బోయిన గోవిందరాజులు, బోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ ఉత్సవాల నిర్వాహణకు సహకరించిన అన్నిశాఖల అధికారులకు, ప్రజాప్రతినిధులకు, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత పాస్‌పోర్ట్ మేళా

టెక్కలి రూరల్: ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థుల కోసం లండన్‌లో కేంద్ర కార్యాలయం గల లియో గ్లోబల్ ఓవర్సీస్ సంస్థ శుక్రవారం ఉచిత పాస్‌పోర్ట్ మేళాను నిర్వహించి వందకుపైగా శ్లాట్లను బుక్ చేయించిందని కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు తెలిపారు. విదేశాల్లో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో స్థిరపడాలకున్న విద్యార్థులకు సహాయం చేయడంలో భాగంగా లియో సంస్థ తమ సిబ్బందితో వచ్చి రోజంతా పని చేసిందన్నారు. ఉచిత పాస్‌పోర్ట్ మేళా వలన విద్యార్థుల సమయం, డబ్బు ఆదా అయిందన్నారు. విదేశాల్లో ఉన్నత విద్య, ఉపాధి అవకాశాలకు ఐతమ్ విద్యార్థుల్లో నెలకొన్న పలు అనుమానాలను నివృత్తి చేసి భవిష్యత్‌లో సహాయ సహకారాలు అందించుటకు లియోగ్లోబల్ ఓవర్సీస్ సంస్థతో ఐతమ్ అవగాహనా ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కార్యక్రమంలో లియోగ్లోబల్ ఓవర్సీస్ అంతర్జాతీయ అడ్మిషన్ మేనేజర్ వాసవి కోన, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, చీఫ్ డెవలప్మెంట్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ సతీష్, మేనేజర్ కె.రాజేంద్ర, ఐతమ్ అసోసియేట్ డీన్, కెరీర్ గైడెన్స్ సెల్ ఇన్‌ఛార్జి డాక్టర్ వై.యుగంధర్, ఫ్యాకల్టీ కె.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

మా బతుకులు ఇంతేనా?

కవిటి: తమ బిడ్డల చదువులు, యువతకు ఉపాధి కల్పనకు అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు కోసం 283 రోజులుగా దీక్ష చేస్తున్నా అధికారులు, నాయకుల్లో చలనం లేదని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం దీక్షలో పాల్గొన్న సుమన్ బిసాయి, బృందావన్ దోలై తదితరులు మాట్లాడుతూ కుల ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో కొన్ని దశాబ్దాలుగా తమ బిడ్డల ఉన్నత చదువులు, యువత ఉద్యోగాలు కొల్పోతున్నట్టు తెలిపారు. ఇప్పటికైనా తమకో పరిష్కారం దొరుకుతుందంటే మార్గం కనిపించడం లేదని, ఇక తమ బతుకులు ఇంతేనేమో? అంటూ నిర్వేదం వ్యక్తం చేశారు. కమిషన్లు, సాంకేతిక కారణాల పేరుతో కాలయాపన జరుగుతోంది తప్పా తమ సమస్య శాశ్వత పరిష్కార దిశగా అడుగులు పడలేదన్నారు. కొత్త ప్రభుత్వమైనా తమకు తొందర్లోనే న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు బెంతు ఒరియా ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బెంతు ఒరియాలు

రెడ్డీస్ పరిశ్రమ వద్ద ధర్నా

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని పారిశ్రామిక వాడ పైడిభీమవరంలో ఉన్న డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ గేటు ముందు శుక్రవారం ఉదయం ఎ షిఫ్ట్ సమయంలో సుమారు 200 మంది కాంట్రాక్టు వర్కర్స్‌కు, పరిశ్రమ ఉద్యోగులకు పరిశ్రమలోనికి వెళ్లనీయకుండా కాంట్రాక్టర్లు లంకలపల్లి ప్రసాదరావు, దంతులూరి లక్ష్మీపతిరాజు ఆధ్వర్యంలో రెడ్డీస్ పరిశ్రమ చుట్టుప్రక్కల గ్రామస్తులు ముక్కుపాలవలస, దేవునిపాలవలస, పెసరపాలేం, పైడిభీమవరం తదితర గ్రామాలకు చెందిన నిరుద్యోగులు, గ్రామస్తులు గేటు ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టర్లు మాట్లాడుతూ పరిశ్రమలో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, సిఎస్ఆర్ నిధులు పరిశ్రమ చుట్టుపక్కల గ్రామాల్లో ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న స్థానిక సిఐ అవతారం, ఎస్ఐ చిరంజీవి పరిశ్రమ వద్దకు సిబ్బందితో చేరుకుని ఎటువంటి అవాంఛనీయ

పరిశ్రమ గేటు ముందు చర్చలు జరుపుతున్న యాజమాన్య ప్రతినిధులు

సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. పరిశ్రమ యాజమాన్య ప్రతినిధులు పరిశ్రమ గేటువద్దకు వచ్చి కాంట్రాక్టర్లు లంకలపల్లి ప్రసాదరావు, దంతులూరి లక్ష్మీపతిరాజు పోలీసుల సమక్షంలో చర్చలు జరిపారు. అయితే ఈ నెల 7న డాక్టర్ రెడ్డీస్ పరిశ్రమ అసిస్టెంట్ డైరెక్టర్ నారాయణ రెడ్డి వచ్చి మాట్లాడుతారని, సమస్యలు పరిష్కారం చేస్తామని నచ్చచెప్పడంతో అందరూ అంగీకరించి కార్మికులను, ఉద్యోగులను పరిశ్రమలోకి విడిచిపెట్టారు. చర్చలు ఆనంతరం ధర్నా విరమించారు.

నూతన మద్యం పాలసీని రద్దు చేయాలి

మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- పలాస

టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన మద్యం పాలసీని తక్షణమే రద్దు చేయాలని, సంపూర్ణ మద్యపాన నిషేధం వైపుగా ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు బదకల ఈశ్వరమ్మ డిమాండ్ చేశారు. సూదికొండ కాలనీలో న్యూ డెమోక్రసీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు జరిగిన రోజుల్లో రాష్ట్రంలో క్రైమ్‌రేటు, ప్రమాదాల సంఖ్య తగ్గిందని, కుటుంబాల ఆదాయం పెరిగి ప్రజల కొనుగోలు శక్తి పెరిగిందని గుర్తు చేశారు. ప్రజల జీవితాల్లో అల్లకల్లోలం సృష్టిస్తున్న నూతన మద్యం పాలసీని తక్షణమే రద్దు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు ఒక మాట వచ్చిన తర్వాత మరొక మాట మాట్లాడడం పాలకులకు అలవాటైందని విమర్శించారు. నూతన మద్యం పాలసీ విధానంలో మద్యంపై వచ్చే ఆదాయం ప్రభుత్వానికి కాకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పటమే ఈ పాలసీ ప్రధాన ఉద్దేశమన్నారు. రాష్ట్రంలో షాపుల సంఖ్య 2900 నుంచి 3600 కి పెంచి ప్రజల సంపాదనని లూటీ చేసి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడమే చంద్రబాబు ఉద్దేశమని ఆమె విమర్శించారు. కార్యక్రమంలో సరస్వతి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

చీడపీడలపై అవగాహన అవసరం

ప్రజాశక్తి- పోలాకి

కృషి విజ్ఞాన కేంద్రం ఆమదాలవలస శాస్త్రవేత్తలు డాక్టర్ ఎస్.నీలవేణి, విస్తరణ విభాగం శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.అనూష, సస్యరక్షణ విభాగం శాస్త్రవేత్త గొల్లలవలస కుసుమ పోలవలసలో చిరు సంచులు పరిశీలన ప్రదర్శన క్షేత్రాలను శుక్రవారం సందర్శించారు. చిరు సంచుల్లో ఎరుపు బియ్యం బొండ్ 2858 యొక్క లక్షణాలు గమనించారు. ప్రస్తుతం వరి పొలాల్లో సుడిదోమ, పొడతెగులు ఆశించిందని తెలిపారు. సుడిదోమ కొరకు పైమెట్రోజిన్ 120 గ్రాములు ఎకరాకు లేదా డైనోటెఫ్యూరాన్ 80 గ్రా. ఎకరాకు హెక్సా కొనజోల్ 400 మి లీ లేదా ప్రోపి కొనజాల్ 200 మి.లీ. ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని తెలిపారు. పిచికారీని దుబ్బులు తడిచేలాగా చేయాలని సూచించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులు, విఎఎ వెంకట్ పాల్గొన్నారు.

సోంపేట: మండల ఎఒ బి.నరసింహమూర్తి నేతత్వంలో మండల వ్యాప్తంగా చీడపీడల నివారణ అవగాహన

పోలాకి : పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వరి పైరుపై చీడపీడలకు అనుకూల వాతావరణం ఉన్నందున, అన్ని గ్రామాల్లో చీడపీడల ఉనికి, వ్యాప్తి మీద వ్యవసాయ సహాయకులతో అత్యవసర సర్వే నిర్వహించి విస్తృత అవగాహన కల్పిస్తున్నమన్నారు. పొడ తెగులు, బ్యాక్టీరియా, ఎండుతెగులు, ఆకుముడత ఉనికి ఉన్నట్లు గుర్తించారు. తెగుళ్ల గుర్తిస్తే నత్రజని వాడకం వాయిదా వేయాలని, చిరుపొట్ట దశలో పొటాష్ వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీ అమలు చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

ప్రభుత్వం ఎన్నికల హామీలో భాగంగా ఉచితంగా ఇసుక అమలు చేయాలని శుక్రవారం తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. సిపిఎం నాయకులు నంబూరి షణ్ముఖరావు మాట్లాడుతూ అధిక రేట్లు చెల్లించగలిగిన కొద్దిమందికి మాత్రమే ఇసుక లభిస్తుందని, అత్యధిక మందికి ఇసుక లభించక నిర్మాణ పనులు ఆగిపోయాయన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పనులు లేక అర్థాకలితో కార్మికులు ఉన్నారని, తక్షణం ఇసుక అందుబాటులోకి తీసుకు రావాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం ట్రాక్టర్ లోడు ఇసుక రూ.8,500లకు బ్లాక్ మార్కెట్‌లో అమ్ము తున్నారన్నారు. ప్రభుత్వం ఫ్రీ ఇసుక నినాదం ఏమైందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణం ఇసుక అందుబాటులోకి తీసుకురావాలని నినాదాలు చేశారు.

ధర్నా చేస్తున్న సిపిఎం, సిఐటియు నాయకులు

అనంతరం తహశీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌కు వినతపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు కొల్లి యల్లయ్య, బగాది వాసుదేవరావు, సిఐటియు నాయకులు సత్తారు ఉత్తర, సత్తారు వేణు, బమ్మిడి అప్పన్న, తిర్లంగి అప్పన్న, బెండి హరిబాబు, గూన త్రినాథ్, కృష్ణ, మల్లేసు తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న పోస్టల్ సిబ్బంది

ట్రైనింగ్ కోర్సులతో వేధింపులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం

ఆచరణ సాధ్యంకాని టార్గెట్లు, ఆన్‌లైన్ ట్రైనింగ్ కోర్సుల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా అధికారులు చేస్తున్న వేధింపులకు వ్యతిరేకంగా ఎన్ఎఫ్‌పిఇ రాష్ట్ర సమన్వయ కమిటీ, ఎఐజిడిఎస్‌యు రాష్ట్ర సంఘాల ఆధ్వర్యంలో మూడురోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి టార్గెట్లు పేరుతో అధికారుల వేధింపులు ఆపాలని కోరుతూ పోస్టల్ సిబ్బంది పోస్టు కార్డుల ద్వారా ఈ మెయిల్స్ ద్వారా చీఫ్ పోస్టుమాస్టర్ జనరల్‌కు విన్నవించడం జరిగిందని జిల్లా నాయకులు గణపతి, బాబూరావు, నందికేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులు టార్గెట్లు పూర్తి చేయలేని ఉద్యోగులపై దురుసుగా ప్రవర్తించడం, వ్యక్తిగతంగా దూషణలు చేయడం, దుర్భాషలాడటం, సెలవులు మంజూరు చేయకుండా వేధిస్తూ నియంతల మాదిరిగా వ్యవహరిస్తున్నారన్నారని, కనీస మౌలిక వసతులు కల్పించకుండా ఉద్యోగులను టార్గెట్లు పేరుతో వేధించడంతో అనేక మంది ఉద్యోగులు అనారోగ్యం పాలవుతున్నారన్నారని, టార్గెట్లు కోసం చేతి సొమ్ము ఖర్చు చేసి అప్పుల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసనలు తెలియ జేస్తున్నారన్నారు. జిల్లా వ్యాప్తంగా టార్గెట్లకు వ్యతిరేకంగా జరుగు తున్న పోరాట కార్యక్రమాలను విజయవంతం చేయ డానికి జిల్లా అంతటా పర్యటనలు చేస్తూ ఉద్యోగులను ఐక్యం చేస్తున్నామన్నారు.

తాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రజలకు తాగునీరు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలం చెందిందని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ నీటి ద్వారా వచ్చే వ్యాధులను గణనీయంగా తగ్గిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో నీటి ఎద్దడి సమస్యను పరిష్కరించడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఇంటికి వ్యక్తిగత కొళాయి కనెక్షన్ల ద్వారా సురక్షిత మైన తాగునీరు అందించడానికి వైసిపి ప్రభుత్వంలో జలజీవన్ మిషన్ పనుల ప్రారంభానికి మాజీ సిఎం వై.ఎస్ జగన్‌మోహన్ రెడ్డి శ్రీకారం చుట్టారని,

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

రాష్ట్రంలోని మొత్తం 95.53 లక్షల గ్రామీణ కుటుంబాల్లో 70 లక్షల కుటుంబాలకు మంచినీటి కొళాయి కనెక్షన్‌లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలకు సురక్షిత తాగునీరు సరఫరాకు వైసిపి ప్రభుత్వం తీసుకున్న చర్యల ద్వారా ఆంధ్రప్రదేశ్ దేశంలోనే ప్రథమ స్థానంలోనే నిలిచిందని కేంద్ర జలశక్తి శాఖ వెల్లడించిన విషయాన్ని ఆమె గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం పాలన 100 రోజులు పూర్తి అయినప్పటికీ ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని, ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించడానికి ఒక్క పని కూడా ప్రారంభించలేదన్నారు.

తైక్వాండో పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఇచ్ఛాపురం: ఎస్‌జిఎఫ్ఐ అండర్ 17 విభాగంలో నలుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఆసి రేవంత్ రెడ్డి 76 కేజీల విభాగంలో, నీలాపు భగవాన్ 51 కేజీ విభాగంలో, తిప్పన జీవన్ 47 కేజీల విభాగంలో, చాట్ల గిరి 45 కేజీల విభాగంలో జిల్లా తరఫున ఎన్నికయ్యారు. వీరందరూ రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్తున్న సందర్భంగా పలువురు అభినందించారు. ఈ పోటీలు 6 నుంచి తిరుపతిలో జరుగుతున్నాయి. ఎన్నికైన విద్యార్థులకు స్థానిక తైక్వాండో క్లాస్ ఆవరణలో కోచ్ దుర్గాప్రసాద్ సమక్షంలో కౌన్సిలర్ ప్రతినిధి విజయభాస్కర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు బత్తిన కృష్ణయ్య, సూరిబాబు అభినందించారు. ఈ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు వెళ్లడానికి ఉపాధ్యాయులు డాక్టర్ ప్రతిభ, పటాన ఢిల్లీశ్వరరావు ఆర్థికసాయం చేసినట్టు కోచ్ దుర్గాప్రసాద్ తెలిపారు.

చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

చెత్త సంపద కేంద్రం పున: ప్రారంభం

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలో చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని శుక్రవారం ఎంఎల్ఎ బగ్గు రమణమూర్తి పున: ప్రారంభించి మాట్లాడుతూ తడి చెత్త, పొడి చెత్త సేకరించి చెత్త సంపద కేంద్రం ద్వారా ఎరువుగా మార్చ వచ్చునన్నారు. దీనివలన ప్రకృతి రైతుకు వ్యవసాయం చేసేందుకు అవకాశం ఉంటుందని, పంచాయతీ పరిధిలో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయన్నారు. ఎంపిడిఒ ఉమా మహేశ్వరరావు, ఇఒ ద్రాక్షాయిని, మాజీ సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యాలయ సిబ్బంది

ఎంపిడిఒలుగా బాధ్యతల స్వీకరణ

పోలాకి: మండల ఎంపిడిఒగా జి.రవికుమార్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఆయనకు ఎంపిడిఒ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి పద్మావతి, సూపరింటెండెంట్ సూర్య ప్రకాష్, సీనియర్ అసిస్టెంట్ దేవరాజు, కార్యదర్శులు మర్యాద పూర్వకంగా పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు.ఇక్కడ విధులు నిర్వహించిన ఉషశ్రీ విశాఖ పట్టణం బదిలీపై వెళ్లారు.

ఆమదాలవలస: స్థానిక ఎంపిడిఒగా రోణంకి వెంకటరావు బాధ్యతలు చేపట్టారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేట మండలం నుంచి బదిలీపై ఇక్కడికు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన ఎంపిడిఒకు కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండల అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు.

కార్మికులకు చీరల పంపిణీ

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని నానుబాల వీధిలో ఉన్న విజయదుర్గ దేవీ ఆలయంలో దేవి నవరాత్రులు పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకులు ఆరవల్లి సూర్యనారాయణ శర్మ, ఫణి శర్మల ఆధ్వర్యాన మున్సిపల్ మహిళా కార్మికులకు 108 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ కమిషనర్ ప్రసాదరావు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సుధీర్‌ల చేతుల మీదుగా వాటిని అందజేశారు. ఊర్వశి సిల్క్స్ అధినేత దేవరశెట్టి ప్రదీప్, కాంచనలత దంపతుల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని అర్చకులు తెలిపారు.

ఆర్ఐగా అప్పలరాజు బాధ్యతల స్వీకరణ

లావేరు: మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా రాపర్తి అప్పలరాజు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంతవరకు గార మండల ఆర్ఐగా పనిచేస్తూ ఇక్కడకి బదిలీపై వచ్చారు. మండలంలో రెవిన్యూ సమస్యలు వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరులో జాప్యం లేకుండా ప్రజలకు అందుబాటులో ఉండి పరిష్కరిస్తానన్నారు. అనంతరం తహశీల్దార్ జోగారావును కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'జ్ఞానభారతి' విద్యార్థులు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు జ్ఞానభారతి విద్యా సంస్థలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో అత్యంత ప్రతిభ చూపి రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. డిస్కస్ త్రోలో అఖిల్ యాదవ్, 100 మీటర్ల హర్డిల్స్‌లో లతాశ్రీ, యోగాలో పి.జగదీష్ రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారు. జ్ఞాన భారతి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సెక్రెటరీ, సిఇఒ జోహార్ ఖాన్ ఎంపికైన విద్యార్థులను శుక్రవారం పాఠశాలలో అభినందించి మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పథకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్టీ వజ్రపు రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐబి

విద్యార్థిని అభినందిస్తున్న జోహార్‌ఖాన్

పండా, హెడ్ మిస్ట్రెస్ రషీదా సుల్తానా, మేనేజర్ ప్రమోద్ కుమార్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజర్ అలీమ్ ఖాన్, వ్యాయామ ఉపాధ్యాయులు కైలాష్ పండా, రాము పాల్గొన్నారు.

స్పందన ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి- సంత బొమ్మాళి

మండలం బడేకుప్పన్నపేట కేంద్రంగా పనిచేస్తున్న కె.పి.స్పందన ఫౌండేషన్ శుక్ర వారం కోటబొమ్మాళి మండలం సరియా బొడ్డపాడుకు చెందిన రోణంకి యుగంధర్‌కు ఆర్థిక సాయం అందించింది. పేదింటి యుగంధర్ 22 ఏళ్ల వయస్సులోనే ఫైలేరియా కారణంగా అనవసర కండర కణజాలం విపరీతంగా పెరిగి కుడికాలు మొత్తం తీవ్రంగా వాచిపోయింది. ఆరు ప్లాస్టిక్ సర్జరీలు అసరమని వైద్యులు చెప్పగా గత 70 రోజులుగా ఆస్పత్రిలోనే ఉండి తల్లిదండ్రులు వైద్యం చేయిస్తున్నారు. ఇప్పుడు రెండు సర్జరీలు అయ్యాయని మిగిలినవి పూర్తయ్యేంత వరకు పొట్ట గడవడానికి, మందుల

ఆర్థికసాయం అందజేస్తున్న షణ్ముఖ మాస్టారు

ఖర్చుల కోసం స్పందన ఫౌండేషన్‌ను ఆశ్రయించగా సంస్థ ప్రధాన క్రియాశీల సభ్యులు షణ్ముక మాస్టార్ విశాఖ వెళ్లి రూ.10 వేలు అందజేశారు. ప్రాంతాలకు అతీతంగా సేవచేయడమే స్పందన ఫౌండేషన్ లక్ష్యమని తెలియజేశారు.

సురేష్‌ని మర్యాదపూర్వకంగా కలిసిన సచివాలయ సర్వేయర్లు

సర్వేయర్లు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లావేరు

మండలం అన్ని గ్రామ సచివాలం సర్వేయర్లు బదిలీల్లో భాగంగా సచివాలయం నుంచి బదిలీపై వెళ్లి నూతనంగా సచివాలయ సర్వేయర్లుగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వీరంతా మర్యాద పూర్వకంగా టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్‌ని తాళ్లవలసలో ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించి సమస్యలు పరిష్కారం చేసి ప్రజలు మన్ననలు పొందాలని సూచించారు. వీరితో పాటు తాళ్లవలస మాజీ సర్పంచ్ ముప్పిడి మురళీ, మండల తెలుగు యువత అధ్యక్షుడు గంట్యాడ మహేష్ తదితరులున్నారు.

పక్కాగా పారిశుధ్య నిర్వహణ

ప్రజాశక్తి- కవిటి

పంచాయతీల్లో పారిశుధ్య నిర్వహణ పక్కాగా ఉండాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. మండల పరిషత్ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.3లక్షలతో కొజ్జిరియాలో డ్రెయినేజీ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ పూర్తిస్థాయి డ్రైనేజీల నిర్మాణం ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని, పారిశుధ్యం నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పాడ నీల, ఎంపిటిసి దశరథరావు, మాజీ ఎంపిటిసి దేవేందర్ రెడ్డి పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎంపిపి ప్రతినిధి

మరమ్మతులు చేయించిన రహదారి వద్ద రాజు తదితరులు

రోడ్డుకు మరమ్మతులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం మరువాడ పంచాయతీ గుడ్డిమీద పేట వద్ద కోతకు గురైన రోడ్డుకు సర్పంచ్ ప్రతినిధి సూరాడ దాసురాజు శుక్రవారం మరమ్మతులు చేయించారు. దాసురాజు మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు గుడ్డిమీద పేటకు వెళ్లే రహదారి మలుపు వద్ద నీటి ప్రవాహానికి రోడ్డు కోతకు గురైందని, దీంతో గత వారం రోజులుగా వాహనాలు రాకపోకలకు అంతరాయం ఏర్పడి ప్రయాణానికి ఇబ్బంది ఏర్పడిందన్నారు. ఈ సమస్యపై సంబంధిత అధికారులతో మాట్లాడి నీటి ప్రవాహానికి ఆటంకం లేకుండా పైపులు ఏర్పాటు చేసి, రహదారి మరమ్మతులు చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మేరుగు నూకయ్య, టిడిపి నాయకులు ధనరాజు, నాయకులు గంట భీమారావు, కొరివి వీర భక్తులు పాల్గొన్నారు.

పలాసలో చోరీ

ప్రజాశక్తి- పలాస

పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 13 ఏళ్ల మైనర్ బాలుడు చోరీకి పాల్పడిన ఘటన కలకలం రేపింది. గురువారం అర్ధరాత్రి దాటిన తరువాత వెంకట పద్మా జీడి పరిశ్రమలో వెనుక డోర్ తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడిన సంఘటన చోటు చేసుకుంది. కత్తి పట్టుకొని కాసేపు హల్‌చల్ చేశాడు. క్యాష్ కౌంటర్ తెరిచి రూ. 5 వేలు దొంగిలించాడు. ఈ చోరీ దృశ్యం షాప్‌లో ఉన్న సిసి టీవీలో రికార్డు అయింది. యజమాని ఫిర్యాదుతో కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తహశీల్దార్‌గా బాధ్యతల స్వీకరణ

కొత్తూరు: స్థానిక తహశీల్దార్‌గా కె.రవి చంద్ర శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనకాపల్లి జిల్లాలో పనిచేస్తూ హిరమండలం మండల తహశీల్దార్‌గా ఒకరోజు పనిచేస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేసిన తహశీల్దార్ బి.పాపారావు మెళియాపుట్టి తహశీల్దార్‌గా బదిలీపై వెళ్లారు.

సిఐగా రామారావు బాధ్యతలు

ప్రజాశక్తి- పాతపట్నం

పాతపట్నం సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వి.రామారావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎస్ఐ లావణ్య, స్టేషన్ సిబ్బంది సిఐని మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. అనంతరం ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డిని కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అంద జేశారు. ఈ సందర్భంగా పాతపట్నం సర్కిల్ పరిధి లోని గంజాయి అక్రమ రవాణా, అక్రమ మద్యం, అసాంఘిక కార్యకలాపాలు నిర్వహణ, నేరాల నియం త్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్‌పి సూచించారు.

రామారావు

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

కోటబొమ్మాళి: స్థానిక శ్రీ కొత్తమ్మతల్లి ఆలయంలో జరుగుతున్న నిత్యన్నదానానికి వరం పవర్ ప్లాంట్ కంపెనీ అధినేతలు బోయిన గోవిందరాజులు, అందవరపు వెంకటనాగేంద్ర ప్రసాద్, అందవరపు సంతోష్ కుమార్, బోయిన సత్యశ్రీనివాస్‌లు శుక్రవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి వాకచర్ల రాధాకృష్ణకు అందజేశారు.

పారిశుధ్య కార్మికులకు వందనం

టెక్కలి: మేజర్ పంచాయతీలోని మురికి కాలువల్లో ఉన్న చెత్తను తీసివేసేందుకు నియమించ బడ్డ పారిశుధ్య కార్మికుల వృత్తి ఒక్కోసారి ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. శుక్రవారం స్థానిక టంకాల సూర్యం కోటర్స్ వద్ద నున్న కాలువలో సిల్టు తీసే ప్రక్రియలో భాగంగా పంచాయతీ పారిశుధ్య కార్మికుడు తన చేతులను కాలువల్లోకి పోనిచ్చి సిల్టు తీసేందుకు చేసిన ప్రయత్నం పలువురిని ఆశ్చర్యం కలిగించింది. కంచ్రవీధిలో ఉన్న కాలువ పనుల్లో భాగంగా సిల్టు తీసే క్రమంలో కార్యదర్శి కె.వి.వి.జగన్నాదం దగ్గరుండి కార్మి కులచే పని చేయి ంచడం గమనార్హం. కాలువల్లో పూడి కతీత పనులు ముమ్మరం చేస్తున్నామని కార్యదర్శి తెలిపారు.

కాలువల్లో చేతుల ద్వారా సిల్టు తీస్తున్న కార్మికుడు

ఒక్కరే కమ్మేలు తరలించగలరా..?

- రైల్వే చోరీ కేసులో ట్విస్ట్
- రాజకీయ ఒత్తిళ్లతో కేసును నీరుగార్చే యత్నం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఒక వ్యక్తి అత్యధిక బరువు కలిగిన రైల్వే కమ్మేలు తరలించగలడా అని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే తిలారు వద్ద రైల్వే కమ్మేలు దొంగలించిన కేసులో మహేంద్ర దాస్ అనే వ్యక్తిపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేసిన సంగతి పాఠకులకు విధితమే. ఒక రకానికి చెందిన మీటరు పొడవు గల కమ్మి 59 కేజీల 700 గ్రాములు మరో రకానికి చెందిన ఒక మీటరు పొడవు గల కమ్మి 52 కేజీల 800 గ్రాముల బరువు కలిగి ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. అంత బరువు కలిగిన కమ్ములను ఒక వ్యక్తి ఎలా తరలించ గలిగాడని పలువురు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. దీని వెనక చాలా మంది హస్తం ఉన్నట్లు పలువురు చెబుతున్నారు. ఇటువంటి చోరీ ఒక్కడు చేసే పని కాదని అంత బరువు కలిగిన కమ్మలను ఒక వ్యక్తి తరలించలేడని ఈ సంఘటనలో అటు రైల్వే ఉద్యోగులు రాజకీయ నాయకుల ప్రమేయం ఉందని పలువురు గుసగుసలాడుతున్నారు. చోరీకి గురైన సొత్తు మహేంద్ర దాస్ ఇంటి వద్ద ఆర్‌పిఎఫ్ అధికారులు గుర్తించారని, అవి ఎక్కడ నుంచి చోరీకి గురయ్యాయన్న సంగతి తమకు తెలియదని ఆర్‌పిఎఫ్ అధికారులు చెబుతుండడం విశేషం.

మహేంద్ర దాస్ ఇంటి వద్ద నిల్వ ఉన్న రైల్వే ఇనుప కమ్మలు (ఫైల్)

మొత్తం పది పట్టాలు చోరీకి గురికాగా 40 అడుగుల పొడవు గలవి - 4, 20 అడుగుల పొడవు గలవి - 6 గురైనట్లు తెలుస్తుంది. సాధారణంగా ఇటువంటి బరువైన కమ్మలను మనుషులు ఎవరు ఎత్తి తీసుకువెళ్లలేరని యంత్రాల సాయంతోనే తరలించాలని పలువురు చెబుతున్నారు. అలాగే తిలారు రైల్వే గోడౌన్‌లో ఉన్నవి బయట ఎన్ని ఉన్నాయన్న సంగతి సిబ్బందికి తెలియదు అనడంలో ఆంతర్యమేమిటో అంతు చిక్కడం లేదు. పూర్తి సమాచారం రైల్వే ఇంజనీరింగ్ అధికారులు వద్ద ఉంటుందని వారి పర్యవేక్షణలో ఈ రైల్వే స్ర్కాప్ పట్టాలకు ఉపయోగించే పరికరాలు తదితరవి ఉంటాయని రైల్వే సిబ్బంది చెబుతుండడం విశేషం. ఈ చోరీ వ్యవహారం కిడిమి గ్రామస్తులు అక్టోబర్ 1న నౌపడ పోలీసులకు, రైల్వే, ఆర్‌పిఎఫ్‌కు ఫిర్యాదు చేయగా అక్టోబర్ 2న నౌపడు పోలీసులు, రైల్వే పోలీసులు వచ్చి చోరీ చేసిన కమ్మలను వాహనాల్లో నౌపడు తరలించారని స్థానికులు చెబుతున్నారు. ఈ రైల్వే కమ్మలు ఎక్కడి నుంచి దొంగలించారనేది ఆర్‌పిఎఫ్ పోలీసులు చెప్పకుండా సమాధానం దాటవేస్తున్నారు. కానీ ఈ కమ్మలు మాత్రం తిలారు రైల్వేస్టేషన్ నుంచి దొంగలించినట్లు విశ్వసనీయ సమాచారం. మహేంద్ర దాస్ కోటబొమ్మాలి మండలం కిష్టపురంలో సచివాలయ సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తుండడంతో మంత్రి అచ్చెన్నాయుడు నియోజకవర్గం కావడంతో ఒకవైపు రాష్ట్రమంత్రి, మరోవైపు కేంద్రమంత్రి నిందితులను కాపాడే ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్లు సమాచారం. అధికారులపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చి కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. రైల్వే ఆస్తులకే రక్షణ లేకుంటే ఎలా అని, ఈ చోరీ కేసుపై రైల్వే ఉన్నతాధికారులు దృష్టి సారించి నిజా నిజాలను వెలికి తీయాలని అలాగే నిందితులందరిపై కేసును నమోదు చేసి కఠినంగా శిక్షించాలని పలువురు కోరుతున్నారు.

చెక్కును అందజేస్తున్న గంగారావు తదితరులు

అన్న క్యాంటీన్‌కు అర్థికసాయం

కోటబొమ్మాళి: టెక్కలి, కోటబొమ్మాళి మండల కేంద్రాల్లో వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తన సొంత ఖర్చులతో నడుపుతున్న అన్నక్యాంటీన్‌కు పలువురు నిమ్మాడ తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆర్థికసాయం అందజేశారు. కోటబొమ్మాళి మండల కేంద్రానికి చెందిన దివంగత సకలభక్తుల సదాశివరావు జ్ఞాపకార్థం సదాశివ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆయన భార్య సులోచనమ్మ, కుమారుడు గంగారావులు రూ.100,116లు చెక్కు మంత్రికి అందజేశారు. అలాగే కోటబొమ్మాళి కళింగ వైశ్య సంఘం మాజీ అధ్యక్షులు పైడిశెట్టి రాంకుమార్ అండ్ బ్రదర్స్ వారి తల్లిదండ్రుల పేరుతో రూ.100,000 చెక్కు మంత్రి అచ్చెన్నాయుడుకు అందజేశారు. అలాగే పొట్నూరు నరసింహ అండ్ బ్రదర్స్, బోయిన శివప్రసాద్‌లు రూ. 25వేలు చొప్పున్న చెక్కులను అన్న క్యాంటీన్ నిమిత్తం మంత్రికి అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు కల్లి లక్ష్మణ్‌రెడ్డి, కల్లి నాగయ్యరెడ్డి, చిన్నసాన ఎంపిటిసి నంబాళ్ల రాజశేఖర్, పంచిరెడ్డి లచ్చుమయ్య, డోకి రమణమూర్తి, లాడి కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ ఎఇగా లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- బూర్జ

లక్ష్మీనారాయణ

బూర్జ మండల గృహ నిర్మాణ శాఖ ఎఇగా కె.లక్ష్మీ నారాయణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకు సరుబుజ్జిలి మండల ఎఇగా విధులు నిర్వహిస్తూ బూర్జ మండలానికి ఇన్‌ఛార్జి ఎఇగా బాధ్యతలను నిర్వహించారు. ప్రస్తుతం పూర్తిస్థాయి ఎఇగా బాధ్యతలు చేపట్టారు.

మురుగునీటిలో ఉన్న తాగునీటి పైపులైన్

కలుషిత తాగునీరు సరఫరా

పొందూరు: మండలం కొంచాడలో మురుగుకాలువ గుండా తాగునీటి పైపులైన్లు వేయడంతో పైపుల్లోకి మురుగునీరి చేరి కలుషితమైన తాగునీరు వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా కలుషిత నీటిని తాగాల్సి వస్తుందని, కలుషితమైన నీరు తాగడంతో రోగాల బారిన పడుతున్నామన్నారు. ఈ విషయాన్ని సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. మురుగునీటి కాలువ సమీపంలో ఉన్న పైపులైన్ పగిలిపోవడంతో కాలువలోని నీరు పైపులోకి చేరి ట్యాంకులోకి వస్తున్నదని, ఆ తాగునీరు గ్రామంలోకి సరఫరా అవుతుందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. గ్రామంలో సుమారు 150 కుటుంబాలు ఈ తాగునీరునే వినియోగిస్తున్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

బోర్ల మరమ్మతులు చేయరూ..?

లావేరు: మండలంలోని కొత్తకోట పంచాయతీ బట్టుపాళెంలో రెండు చేతి బోర్లు మరమ్మతులకు గురై ఏళ్ల గడుస్తున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోక పోవడంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. చిన్ను రెయ్యమ్మ ఇంటి సమీపంలోని బోరు, అంగన్వాడీ కేంద్రం సమీపంలో ఉన్న మరో బోరు గత రెండేళ్లుగా మరమ్మతులు చేయకపోవడంతో గ్రామంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలో తరచూ విద్యుత్ నిలుపుదల అయినప్పుడు, వర్షాలు వచ్చినప్పుడు రెండు, మూడు రోజులు విద్యుత్ సరఫరా లేనప్పుడు ఈ చేతి బోర్లుపైనే ఆధారపడాల్సి ఉంటుంది. అయితే ఈ బోర్లు మరమ్మతులకు గురై రెండేళ్లపైబడినప్పటికీ మరమ్మతులు చేపట్టకపోవడంతో దిష్టిబొమ్మలా దర్శన మిస్తున్నాయి. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టి గ్రామస్తులకు తాగునీరు అందించాలని కోరుతున్నారు.

యువజన సమస్యల పరిష్కారానికి ఉద్యమం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

దేశ అభివృద్ధిలో యువత పాత్ర ఎంతో కీలకమైనదని, అలాంటి యువత పాలకుల నిర్లక్ష్య ధోరణితో సమస్యలు సుడిగుండంలో కొట్టుమిట్టాడుతుందని, సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యమని, ఇలాంటి తరుణంలో యువజన సమస్యల పరిష్కారానికి వేదికగా శ్రీకాకుళం జిల్లా కానుందని అఖిలభారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) మాజీ జాతీయ కార్యదర్శి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య అన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర 22వ మహాసభను శ్రీకాకుళంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 6, 7, 8, 9 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థానిక వినీలా ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఎఐవైఎఫ్ రాష్ట్ర మహాసభల ఆహ్వాన సంఘ సమావేశాన్ని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు పి.రాజేంద్రబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ పోరాటాల పురిటిగడ్డ శ్రీకాకుళంలో మహాసభలు నిర్వహించడం చారిత్రాత్మకమన్నారు. మోడీ పాలనతో దేశ భవిష్యత్‌కు ప్రమాదకరమన్నారు. బిజెపి నిరంకుశ పాలకులను సాగనంపడానికి యువత ఉద్యమించాలన్నారు. రాష్ట్ర మహాసభల్లో స్థానిక యువత సమస్యలతో పాటు, దేశవ్యాప్త ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. మహాసభలకు జాతీయ స్థాయిలో సిపిఐ నాయకులు హాజరవుతారన్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు, సిపిఐ శ్రీకాకుళం, పార్వతీపురం జిల్లాల కార్యదర్శులు చాపర వెంకటరమణ, కూరంగి మన్మధ రావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శులు ఎం. యుగంధర్, జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు జి.వాసు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఈశ్వరయ్య

శిక్షణను పరిశీలిస్తున్న శంకరరావు

విద్యార్థులకు శిక్షణా తరగతులు

పాతపట్నం: మండల కేంద్రంలో ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాల, ప్రహరాజు పాలెంలో ఎపి సమగ్ర శిక్ష 10వ తరగతి, ఇంటర్ ప్రథమ, ద్వితీయ విద్యార్థులకు ఒకేషనల్ విద్యలో భాగంగా ఐటి, ఐటిఇఎస్ విభాగంలో 10 రోజుల పాటు దసరా సెలవుల్లో మీసేవ, టైపు అండ్ జిరాక్స్, కంప్యూటర్ జాబ్‌వర్క్స్, ఇంటర్నెట్ సెంటర్స్, ఫోటో స్టూడియోస్, ఫ్లెక్సీ బ్యానర్ సెంటర్స్, కంప్యూటర్ ఇన్సిట్యూట్స్, ప్రింటర్ కేర్ అండ్ హార్డ్‌వేర్ పాతపట్నం, పర్లాకిమిడిలో రోజుకు 8 గంటల చొప్పున శిక్షణా తరగతులను ఒకేషనల్ ట్రైనర్ వై.నరేష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. ఈ శిక్షణను శుక్రవారం ఐసిఎ (విటిపి) కో-ఆర్డినేటర్ జి.శంకరరావు పర్యవేక్షించి మాట్లాడుతూ ఒకేషనల్ కోర్సుల ద్వారా నైపుణ్యత సాధించిన విద్యార్థులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. ఒకేషనల్ కోర్సులు అభ్య సించిన పూర్వ విద్యార్థులకు, ఉపాధి, ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా లభించాయని ప్రిన్సిపాల్ రత్నకుమారి తెలిపారు.

కమ్యూనిటీ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించాలి

ప్రధాన ద్వారం వద్ద లైట్లు లేక అంధకారంలో ఉన్న ఆస్పత్రి

ఇచ్ఛాపురం: పట్టణంలో ఉన్న ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రిలో నెలకొన్న సమస్యలు పరిష్కారం కోసం అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ సీడాప్ చైర్మన్ శ్యామ్ ప్రసాద్ రెడ్డి కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో నెలకొన్న పలు సమస్యలు రోగులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. దీంతో ఆస్పత్రికి వెళ్లి పరిశీలించగా రోగులు పడుతున్న అనేక ఇబ్బందులు కనిపించాయన్నారు. ప్రధానంగా విద్యుత్ సరఫరా ఆగిపోయిందని, జనరేటర్ ఉపయోగంలోకి రాలేదని, రోగులు చీకట్లో వెలుతురు లేక దోమల బెడదతో ఇబ్బంది పడటం బాధాకరమన్నారు. రోగులకు ఆహారం సరఫరా లేదని, ఆస్పత్రికి వెళ్లే మార్గంలో లైట్లు పూర్తిగా పనిచేయక పోవడంతో రోగులకు, సిబ్బంది ఇబ్బందులు పడు తున్నార న్నారు. ఆక్సిజన్ ప్లాంట్ పనులు పూర్తి కాకపోవడంతో అత్యవసర పరిస్థితిల్లో ఆక్సిజన్ సిలిండర్‌పైన ఆధారపడే పరిస్థితి నెలకొందన్నారు. ఆస్పత్రిలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా పని చేయక మురుగు నీరు నిల్వ పెరిగి దోమల బెడద అధికమవుతుందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి వసతులు మెరుగు పర్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

చేసిన సేవలే గుర్తింపునిస్తాయి

పలాస: విధి నిర్వహణలో చేసిన సేవలే గుర్తింపునిస్తాయని తహశీల్దార్ బి.సత్యం అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రాత్రి తహశీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది తహశీల్దార్ బి.సత్యంకు ఘనంగా సన్మానించారు. అనంతరం జరిగిన వీడ్కోలు సభలో ఆయన మాట్లాడుతూ తాను వచ్చిన తక్కువ రోజుల్లోనే అధికారులు, సిబ్బంది ఎంతో సహకారం అందించారని కొనియాడారు. తక్కువ సమయంలో బదిలీ కావడం బాధగా ఉన్నప్పటికీ ఉద్యోగులకు బదిలీలు, పదోన్నతులు సర్వ సాధారణమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మి నారాయణ, ఆర్ఐ నిరంజన్, రీ సర్వే డిప్యూటీ తహశీల్దార్ వైకుంఠ రావు, మండల సర్వేయర్‌లు గిరి ప్రసాద్, రాజేష్, విఆర్‌ఒలు, రెవిన్యూ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ సత్యంకు సన్మానం చేస్తున్న రెవెన్యూ సిబ్బంది

చెవిటమ్మతల్లిని దర్శించుకున్న తమ్మినేని

ఆమదాలవలస: దేవి నవరాత్రుల సందర్భంగా పట్టణ శివారున ఉన్న చెవిటమ్మ తల్లిని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారిని రెండో రోజు గాయత్రీ దేవిగా అలంకారం చేయడంతో స్పీకర్ కుటుంబ సభ్యులతో సహా ఆలయాన్ని సందర్శించారు. అనంతరం ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. మాజీ కౌన్సిలర్ అల్లం శెట్టి ఉమా మహేశ్వరరావు పాల్గొన్నారు.

దర్శించుకుంటున్న మాజీ స్పీకర్ సీతారాం